నేడు సిఐటియు నేత రాజులోవ సంస్మరణ సభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ సంస్మరణ సభ నగరంలోని విక్రమ హాల్‌లో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎవి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థి, యువజన, మహిళా, సాంస్కృతిక కళా రంగాలతోపాటు సిఐటియు అనుబంధ సంస్థలు, వామపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పెరుగుతున్న ఎండలు

- ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తుపాను నేపథ్యంలో కొద్ది రోజులుగా చల్లబడ్డ వాతావరణం తిరిగి వేడెక్కింది. వేసవి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు సామాన్యులకు చిక్కులు తెస్తున్నాయి. వాస్తవంగా రికార్డు అవుతున్న ఉష్ణోగ్రతతో పోలిస్తే అంతకుమించిన వేడి ఎదురవుతోందని చాలామంది భావిస్తున్నారు. వాతావరణంలో మార్పులతో సాధారణ ఉష్ణోగ్రతలు కూడా భరించలేని పరిస్థితి వచ్చేసింది. ఈ నెల 25 నుంచి రోహిణీ కార్తె ప్రారంభమై వచ్చే నెల 8 వరకూ ఉంటుంది. ఇప్పటికే రెండు రోజులుగా ఎండలు మండుతున్నాయి. తీవ్రమైన ఎండ, వడ గాల్పులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నేటి నుంచి కార్తె ప్రారంభమవుతుండగా ముందు రోజు శుక్రవారం అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఎండలు ఏ మేరకు తీవ్రతను చూపుతాయనేది చర్చనీయాంశంగా మారింది.

పెరుగుతున్న కాలుష్యం కారణంగా వేసవి వేడి మరింత భరించలేనిదిగా మారిపోయింది. కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ రూరల్ తదితర మండలాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కాలుష్యం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. దానికి తోడు రోహిణి కార్తె ప్రారంభమవుతున్న వేళ మరింత కలవరం కలిగిస్తోంది. రోహిణీ కార్తెలో ఎండ వేడిమి మరింత పెరగవచ్చనే అంచనాలున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదయ్యాయి. గతేడాది అనేక సార్లు 43 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రతలు ఈసారి 45 డిగ్రీలు కూడా నమోదైంది.



కాకినాడ జిల్లా సామర్లకోటలో నిర్మానుష్యంగా ఉన్న గాంధీ బొమ్మ సెంటర్



అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్మానుష్యంగా ఉన్న హైస్కూల్ సెంటర్

రోహిణీ ప్రభావం

ఇప్పటి వరకు ఈ సీజన్ గడిచిపోయినప్పటికీ రోహిణీ కార్తె మాత్రం దానికి భిన్నంగా ఉంటుందనే అంచనాలున్నాయి. జిల్లాలో కాకినాడలో 39 డిగ్రీలు, మిగిలిన చోట్ల 37 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం నుంచి వాటిలో పెరుగుదల ఇంకా పెరుగుతుందని భావిస్తున్నారు. ఈలోగా రుతుపవనాలు గనుక ప్రవేశిస్తే ఉపశమనం దక్కుతుంది. రుతుపవనాల రాక అలస్యమయితే మాత్రం కొంత సమస్య ఉంటుంది. ప్రస్తుతం వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ మొదటి వారంలో మన జిల్లాపై రుతుపవనాలు ప్రభావం చూపుతాయి. అప్పటి వరకూ ఎండ వేడిమి కొనసాగితే మాత్రం సుమారు పదిరోజుల పాటు సూర్యుని ప్రతాపం భరించాల్సి ఉంటుంది.

జాగ్రత్తలు అవసరం

వేసవి తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున అందరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. వద్దులు, చిన్న పిల్లల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 10 తర్వాత సాయంత్రం 4గంటల వరకు ఎండలో తిరిగే పని వీలయినంత మేరకు తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా సేవించాలి. ఎండలో తిరేగటప్పుడు తగిన రక్షణ కోసం టోపీ, కళ్ల జోడు వంటివి ధరించాలి. ఇతర జాగ్రత్తలు తీసుకుని రోహిణీ కార్తెలో భానుడి భాగభగలు తాకిడి నుంచి తట్టుకోవడానికి సిద్ధం కావాలని తెలిపారు.

శాంతి భద్రతలపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన 4న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శాంతి భద్రతలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర డిజిపి ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాటుచేసిన చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కాలేజీ చుట్టుపక్కల 2 కిలోమీటర్ల మేర రెడ్ జోన్ గా ప్రకటించినందున, స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ ఉన్న గగనతలంలో అనధికార డ్రోన్ కార్యకలాపాలను 2 కిలోమీటర్ల మేర నిషేధించారని పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పి ఈ రెడ్ జోన్ నిబంధనలు వెంటనే అమలులోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించినారు. ఈ రెడ్ జోన్ నిబంధనలు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు అమలులో ఉంటాయని అన్నారు. ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమించిన ఎడల వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి ఎస్. శ్రీధర్ . ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పి ఎస్. ఖాదర్ బాషా పర్యవేక్షణలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దష్ట్యా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమలాపురం సబ్-డివిజన్ లో అమలాపురం డిఎస్‌పి మహేశ్వర రావు ఆద్వర్యంలో ముమ్మిడివరం సిఐ కొండయ్య, కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు కాట్రేనికోన పోలీస్ స్టేషన్ సిబ్బంది సహాయంతో కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామం నందు ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ ఆపరేషన్ నిర్వహించారు. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 11 మోటార్ సైకిల్స్ ఒక ఆటోను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. కొత్తగా ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరిస్తున్నట్లు అయితే వివరాలు పోలీసులకు తెలియపరచవలసిందిగా ప్రజలను కోరారు. కొత్తపేట సబ్-డివిజన్ లో అమలాపురం డిఎస్‌పి కెవి.రమణ ఆద్వర్యంలో రావులపాలెం టౌన్ సిఐ జేమ్స్ రత్న ప్రసాద్, ఎస్ఐ ఎల్.రాజేష్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సహాయంతో రావులపాడు గ్రామం నందు ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినారు. కొత్తగా ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరించుచున్నట్లు అయితే వివరాలు పోలీసులకు తెలియపరచవలసిందిగా ప్రజలను కోరారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా జిల్లా అంతటా డిఎస్‌పిలు, సిఐలు మరియు ఎస్ఐలు అందరూ వారి వారి పరిధిలో రావులపాలెం మండలం రావులపాడు గ్రామంలో, సఖినేటిపల్లి మండలం గొంది గ్రామములనందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోను, ప్రజలతోను సమావేశాలు నిర్వహించి, విధివిధానాలపై అవగాహన కల్పించారు. **కపిలేశ్వరపురం:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న జగనన్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా సరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కట్టిన చర్యలు తీసుకుంటామని అంగర ఎస్ఐ అందే పరదేశి హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సెక్షన్ 144, 30 ఉన్నాయన్నారు. జిల్లా ఎస్పి ఆదేశాను సారం గ్రామాల్లో పోలీస్ సిబ్బంది తో ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ శాంతి భద్రతలపై గురువారం కపిలేశ్వరపురం మండలం నేలటూరు గ్రామంలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని పోలీస్ శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు .ర్యాలీలు, ఊరేగింపులు ,సమావేశాల కు ఏ విధమైన అనుమతులు లేవన్నారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామాల్లో స్థానికులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసు సిబ్బంది

నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి

ప్రజాశక్తి-కొత్తపేట

మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత ప్రమాణాలతో సంతులిత ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారులు ఎం.హరి ప్రసాద్, కె.లీలావతి అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజన పథక నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకుల వంటల పోటీలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు , మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలో గురువారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం సిఐటియు నాయకులు,కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాట్రేనికోన : పోరాటాల ద్వారానే కార్మికుల హక్కుల సాధ్యమవుతుందని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు మోహన్ రావు, రాంబాబు పేర్కొన్నారు. గురువారం 54వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవంను కాట్రేనికోన మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు .అనంతరం సిఐటియు మండల అధ్యక్షులు విప్పర్తి మోహన్‌రావు, కార్యదర్శి విత్తనాల రాంబాబు మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటూ, కార్మికవర్గ రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 1970 మే 30వ తేదీన సిఐటియు ఏర్పడిందన్నారు. గత పది సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం కార్మికులకు ఉన్న ప్రాథమిక హక్కులైన 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకువచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో 15 ఏళ్లుగా పరిశ్రమల్లో కనీస వేతనాలు సవరణ చేయడం మానేశారని, దీంతో ప్రతిరోజు నిత్యావసరాల ధరలు పెరుగుదలతో కార్మికుల జీవితాలు అధమ స్థాయికి పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, కనీస వేతనం 26 అమలుచేయాలని, స్కీమ్ వర్కర్లను, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేంతవరకు, అసంఘటితరంగ కార్మికులైన ఆటో, హమాలి, భవన నిర్మాణ, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల జీవితాలకు భద్రత కల్పించెంతవరకు అలుపెరగని పోరాటాలకు కార్మికవర్గం సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మికుల మండల కార్యదర్శి బొంతు పార్వతి, అధ్యక్షులు గుత్తులు కనకదుర్గ, ఇసుక పట్ల వెర్రమ్మ, సత్యవతి, ఆదిలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం :** ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యం అని ముమ్మిడివరం నగర పంచాయతీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయం అవరణలో గురువారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శివ ప్రసాద్ సిఐటియు జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులను ప్రభుత్వాలు తు.చా.అమలు చేయాలని, సమానపనికి సమాన వేతనం తో పాటు కార్మిక చట్టాల బలోపేతానికి పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి 1970 మే 30 సిఐటియు ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, కె.గోవిందరావు, కె.వెంకట శివ, రమణ అరుణ్ కుమార్, అజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, రమేష్, సురేష్, రవీంద్ర ప్రసాద్, రాంబాబు, అరుణ, లక్ష్మి లతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.



కాట్రేనికోన మండల సిఐటియు ఆవిర్భావ దినోత్సవంలో కార్మికులు



సిఐటియు ఆవిర్భావ దినోత్సవంలోముమ్మిడివరం నగర పంచాయతీ కార్మికులు

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని కావాలనే నిర్వీర్యం చేస్తున్నాయని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. పొమ్మన లేక పొగబెట్టే చందంగా ఉపాధి హామీ చట్టం నిధుల్లో కోత విధించి ఉపాధి కూలీలకు ఉపాధి చట్టాన్ని ప్రభుత్వాలు దూరం చేస్తున్నారని ఆయన అన్నారు. గురువారం అమలాపురం మండలం బండారులంక, నడిపూడి తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి చట్టాన్ని ఎత్తి వేస్తామని అంటున్నారని, గ్రామాల్లో ఉన్న పెత్తందారులు కూడా అదేమాట అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో ఈ చట్టం రద్దు అవ్వకుండా పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ చట్టాన్ని కాపాడుకుంటేనే కార్మికులకు కొంత మేలు చేకూరుతుందన్నారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600 పెంచాలని, గతంలో ఇచ్చిన ఫే స్లిప్ విధానం ఇప్పుడు కూడా ఇవ్వాలని, కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఎలాంటి ఇన్సూరెన్స్ సదుపాయమూ లేదన్నారు. అటువంటి వారికి రూ.5లక్షల ఇన్యూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు కూలీలకు ఇవ్వడం లేదని, అన్ని గ్రామాల మేట్లకు మెడికల్ కిట్లు, టెంట్లు అందించే ఏర్పాట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పి.గన్నవరం మండలంలో ఇటీవల ఉపాధి పని చేస్తున్న కూలీలు తేనెటీగల దాడిలో గాయాలు పాలయ్యారని వారిని ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని, రెండు నెలల పాటు ఉపాధి హామీ చట్టంలో వేతనం ఉచితంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సరళ రాజు చంటి, పొలమూరి శ్రీనివాసరావు, మెట్లు ఎం.రాజేశ్వరి, జి.తేజ కుమారి, టి.లక్ష్మి శ్రీదేవి, దుర్గాదేవి, బి.సతీష్, ఎస్.నాగలక్ష్మి, జి.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

పూడికతీత పనులు వేగంగా చేపట్టాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో పంట కాలవలు మురుగు కాలవలు పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రధాన పంట కాలవల్లో ఆక్రమణలు తొలగించాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ వెంకటేశ్వరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అప్పారి వెంకటేశ్వరరావు, పీతల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రకతి వైపరీత్యాలు సంభవిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన పంట కాలవలు మురుగు డ్రెయిన్లు ఆధునీకరణ చేపట్టక పోవడంతో వరి సాగు చేసేటువంటి పంటలన్నీ కూడా ముంపునకు గురై చేతికి వచ్చిన పంట నాశనం అయ్యి రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఈ వేసవి కాలంలో పంట కాలువలు ప్రధానమైన మురుగు డ్రెయిన్లను తక్షణం పూడుకు తీత పనులు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. చాలా మంది ప్రధాన పంట కాలవలు మురుగు కాలవలు ఆక్రమణ గురి చేస్తున్నారని వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. వంటకాలవల్లో కొంతమంది దుర్మార్గులు సెప్టిక్ ట్యాంక్ నుంచి వచ్చే వ్యర్థాలను వంట కాలువల్లోకి వదులుతున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వచ్చే సీజన్లో రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కౌలు రైతులకు ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు జిల్లా నాయకులు పి. శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.




డిఆర్ఒకి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరావు, రామచంద్రరావు తదితరులు

చంద్రబాబును కలిసిన టిడిపి అభ్యర్థి సుబ్బరాజు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును కూటమి బలపరిచిన ముమ్మిడివరం నియోజకవర్గం టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి మరియు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాట్ల సుబ్బరాజు ఈ నె ల 29న సాయంత్రం హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. సుబ్బరాజు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలపై చంద్రబాబుతో చర్చించానని తెలిపారు. ఎన్నికల్లో పార్టీ విజయవ కాశాలు తదితర విషయాలపై చర్చించుకున్నామని అన్నారు.

కార్టూ'నిజం'



'వివేకానంద'లో విలువలతో కూడిన విద్య

- విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, డిజిటల్ విద్యాబోధన
- ఉత్తమ భవిష్యత్తు అందించడమే తమ లక్ష్యం
- పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ప్రసాద్

ఒప్రజాశక్తి-రాజోలు

మలికిపురం మండలంలో విశ్వేశ్వరాయపురంలో ఉన్న వివేకానంద ఇంగ్లిషు మీడియం పాఠశాల విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంలో ముందంజలో దూసుకుపోతోంది. పాఠశాలలో నర్సరీ నుంచి 10వ తరగతి వరకు తరగతులు ఉన్నాయి. పాఠశాల అధ్యాపక బృందం, యాజమాన్యం, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతుంది. క్రమ శిక్షణతో కూడిన విద్యనందిస్తూ తనకు తానే సాటని నిరూపించుకుంటుంది. ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం సమగ్ర ప్రణాళికతో అంకితభావంతో సజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తూ పోటీ ప్రపంచంలో ధీటుగా నిలుస్తోంది. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చి దిద్దుతాం. తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యను అందిస్తున్నామంటున్నారు యాజమాన్యం. విశిష్టతలు విశేష అనుభవం కలిగిన సీనియర్ ఉపాధ్యాయులచే శిక్షణ, ప్రతి తరగతికీ పరిమిత సంఖ్యలో విద్యార్థులు పూర్తి ప్రణాళికబద్ధమైన కరిక్యూలం విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య, ప్రతి సబ్జెక్టునందు ఐఐటి, జెఇఇ, ర్యాంకు ఒరియేటేషన్, కాన్సెప్ట్యువల్ టీచింగ్, బట్టీవిధానం కాకుండా, సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగించే విధంగా సబ్జెక్టు ఎక్స్‌ఫర్ట్‌చే బోధన, విద్యార్థులకు అన్ని రకాల సదుపాయంతో తరగతి గదులు, . ఉచిత స్టడీఅవర్స్ నిర్వహణ, మినరల్ నీటి సౌకర్యం, వెనుకబడిన విద్యార్థిని, విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, ఆధునాతనమైన పద్ధతిలో కంప్యూటర్ విద్యాబోధన, స్పోకన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహణ, క్యాలిగ్రఫిక్ ద్వారా విద్యార్థులకు మంచి చేతి రాత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.దీని వల్ల గత 15 సంవత్సరాలుగా 10 వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.



ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థుల ఉత్తమ భవిష్యతే లక్ష్యంగా పెట్టుకొని కృషి చేస్తున్నాం. నర్సరీ నుంచి తమ పాఠశాలలో అడ్మిషన్ల ప్రారంభమయ్యాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను వివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో చేర్పించాలని మనవి. అను భవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో అన్ని రకాల వసతులతో శిక్షణ ఇస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేరే విధంగా తీర్చిది ద్దుతాం.తక్కువ ఫీజుతో ఉత్తమ విద్య మాస్కూల్ ప్రత్యేకతలో ఒకటి.

-పివివి.వర ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్

మా పాఠశాల ప్రత్యేకతలు

1. అనుభవంతో కూడిన టీచర్లతో ఆంగ్ల విద్యా విధానం.
2. విద్యార్థులకు మరింత సబ్జెక్ట్ విశ్లేషణకి ప్రొజెక్టర్ సహాయంతో డిజిటల్ తరగతుల నిర్వహణ.
3. ఇంగ్లీష్‌లో విద్యా బోధన. 4. ప్రతి విద్యార్థిని ఆంగ్లంలో మాట్లాడించుట.
5. విద్యార్థులను సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములని చేయుట. యోగా, డ్రాయింగ్, డాన్స్ క్లాసులు మా ప్రత్యేకత.
6. ముఖ్యమైన విషయములు సందేశములు ద్వారా మీ మొబైల్ ఫోన్ కి పంపించుట.
7. చేతి రాత మరియు కలిపి రాత నేర్పించుటకు ప్రత్యేక శ్రద్ధ వహించుట.
8. సి.సి కెమెరాల సహాయంతో నిరంతర పర్యవేక్షణ.
9. బస్ సౌకర్యం. 10.ఒత్తిడి లేని విద్య.



వివేకానంద స్కూల్ లోగో



'ఒలింపియాడ్'లో ప్రతిభ చూపి మెమెంటోలు అందుకుంటున్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన బత్తిన వీరబాబు(42) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బత్తిన వీరబాబుకు ఈ నెల 29వ తేదీన ఇంటి వద్ద గడ్డి మందు తాగడంతో గమనించిన చుట్టుపక్కల వారు పెద్దాపురం గవర్నమెంట్ హాస్పటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు వచ్చిన సమాచారంపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఉడుమూడిలో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - రామచంద్రపురం

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కె.గంగవరం మండలం ఊడిమూడి గ్రామంలో చోటుచేసుకుంది. దీని సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. కూళ్ళ గ్రామానికి చెందిన కోటిపల్లి లక్ష్మి కుమారి (38) ఉడుముడి గ్రామానికి చెందిన జ్ఞాన శంకర్ సతీష్ ను 17 ఏళ్ల క్రితం వివాహం చేసుకుంది. ఇటీవల భార్యా భర్తలకు తరచూ మనస్పర్థలతో గొడవలు ఏర్పాడ్డాయి. దీంతో ఆమె విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై మృతురాలు తండ్రి సలాది సత్తిరాజు కె.గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌కె.జానీ బాషా దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని రామచంద్రపురం సిఐ పి.దొరరాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని మహిళ మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీ మాధవరాయణుపేటకి చెందిన పిల్లి ఏడుకొండలు, ఈశ్వరి దంపతుల కుమార్తె పిల్లి ధరణి సత్య (23) బుధవారం చెన్నైలో రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందింది. విధి నిర్వహణలో భాగంగా ఉద్యోగానికి వెళు తూ చెన్నై పెరుంగలత్తూరు రైల్వే స్టేషన్ లో క్రాసింగ్ జంక్షన్ వద్ద వస్తున్న రైలును గమనించకుండా రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. దీంతో తాళ్లరేవు గ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి. కుమార్తె ప్రమాదంలో మరణించిందని వార్త తెలియగానే తల్లిదండ్రులు స్పృహ కోల్పోయారు. కొద్దిసేపటికి తేరుకుని హుటాహుటిన కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైకి బయలుదేరి వెళ్లారు.

ఆధునిక జీవనశైలితో ఊబకాయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మన ఆహారపు అలవాట్లలో పెద్ద ఎత్తున ఆధునిక మార్పులు రావడంతో పలువురు ఊబకాయులు అవుతున్నారని పోషకాహార నిపుణులు పి. పార్థసారథి అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫాస్ట్ ఫుడ్స్, ప్రాసెస్ ఫుడ్ వినియోగం వలన పలువురు ఊబకాయిలు అవుతున్నారన్నారు. తీసుకునే ఆహారం ద్వారా తాజా కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలు అధికంగా తీసుకోవడం ద్వారా నివారించవచ్చునని అన్నారు. నూనె, కొవ్వు పదార్థాలను పరిమితంగా తీసుకోవాలన్నారు. రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, తగినంతగా మంచినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా, చందర్రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశంలో కొత్తగా 14.1లక్షల క్యాన్సర్ కేసులు

ప్రజాశక్తి-అమలాపురం

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, 2022లో భారతదేశంలో 14.1 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు మరియు 9.1 లక్షల మంది క్యాన్సర్ కారణంగా మరణించారని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్‌తో జీవిస్తున్నారనీ ఆంధ్రప్రదేశ్‌లో 2022లో 75,536 కొత్త క్యాన్సర్ కేసులు మరియు 40,307 మరణాలు నమోదయ్యాయని అన్నారు. భారతదేశంలో 75 ఏళ్లలోపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 10.6 శాతం మరియు అదే వయస్సులో క్యాన్సర్‌తో మరణించే ప్రమాదం 7.2శాతం ప్రపంచవ్యాప్తంగా, ఈ ప్రమాదాలు వరుసగా 20 శాతం మరియు 9.6 శాతం. రొమ్ము, నోటి మరియు గర్భాశయ క్యాన్సర్‌లు భారతదేశంలోని మొత్తం క్యాన్సర్ కేసులలో 34 శాతం ఉన్నాయన్నారు. ఇవి నివారించగల క్యాన్సర్‌లని. ముందస్తుగా గుర్తించడం ఈ క్యాన్సర్‌ల మనుగడ రేటును గణనీయంగా తగ్గించవచ్చన్నారు. పెరుగుతున్న క్యాన్సర్ కేసులను ఎదుర్కోవడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కష్ణబాబు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ మార్గదర్శకత్వంలో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి నిర్ణయం తీసుకుందనీ రొమ్ము, నోటి మరియు గర్భాశయ క్యాన్సర్‌ల కోసం 30 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులందరినీ పరీక్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా, విశాఖపట్నంలోని హోమిబాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అన్ని వైద్య కళాశాలల్లోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్‌లలోని నిపుణుల కోసం మొదటి స్థాయి సెన్సిటైజేషన్ శిక్షణ పూర్తయిందనీ అయన తెలిపారు. ఇప్పుడు మేము డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్‌లకు రెండవ స్థాయి శిక్షణను నిర్వహిస్తున్నామనీ మూడవ స్థాయి శిక్షణలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎస్‌ఎంలకు శిక్షణ ఉంటుందన్నారు. హైపర్‌టెన్షన్ మరియు మధుమేహం కోసం ఎన్‌సిడి స్క్రీనింగ్ 3.0తో పాటు జూలై 2024 నెలలో స్క్రీనింగ్ ప్రారంభం కానుండగా, జూన్ 15 నాటికి అన్ని శిక్షణా సెషన్‌లు పూర్తవుతాయనీ స్క్రీనింగ్ సమయంలో కనుగొనబడిన క్యాన్సర్ కేసులు తదుపరి రోగ నిర్ధారణ నిర్వహణ కోసం మెడికల్ కాలేజీలకు పంపబడతాయన్నారు. ఈ కేసులను ఆరోగ్య వ్యవస్థ నిశితంగా పరిశీలిస్తుందనీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా సరైన రిఫరల్ సిస్టమ్‌ను నిర్ధారిస్తూ, డేటాను పర్యవేక్షించడానికి నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోందని దుర్గారావు దొర తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ల సహాయంతో సాంకేతిక మార్గదర్శకాలను అందిస్తోందనీ వారు కొనసాగుతున్న ప్రోగ్రామ్ యొక్క నాణ్యతా తనిఖీకి వెళతారనీ ఆయన తెలిపారు.

చిరస్మరణీయుడు రాజులోవ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సిఐటియు జిల్లా కార్యదర్శి బి.రాజులోవ సంస్మరణ సభ నేడు జరగనుంది. రాజులోవ ఇటీవల హఠాన్మరణానికి గురైన విషయం విదితమే. గడిచిన రెండు దశాబ్దాలుగా విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలను ఆయన ముందుండి నడిపించారు. పోలీసుల నిర్బంధాలు, అక్రమ అరెస్టులను సైతం ఎదుర్కొన్నారు. ఇటీవల జరిగిన అంగన్‌వాడీల 42 గంటల సమ్మె, ఆశా వర్కర్ల 36 గంటల దీక్షలకు, విఓఏ,విఆర్‌ఏల పోరాటాలు, సర్వశిక్ష అభియాన్ సమ్మె, రాజమండ్రి నగరంలో స్కూల్ స్వీపర్ల సమస్యలపై అనేక ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. నగరంలో పౌర సమస్యలపైన సోషల్ మీడియా వేదికగా చురుగ్గా వ్యవహరించేవారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం 2007-2008లో నగరంలో జరిగిన భూపోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. రౌతులపూడి మండలం రామకృష్ణాపురంలో నిరుపేద రైతు కుటుంబంలో బి.రాజులోవ 1-07-1986న జన్మించారు. పెద్దాపురం మహారాణి కాలేజీలో 2002 నుంచి 2007 వరకూ ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యను పూర్తి చేశారు. ఈ కాలంలోనే విద్యార్థి ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి పోరాటాలకు నాయకత్వం వహించారు. పిఆర్ కాలేజీ ఎస్‌ఎఫ్‌ఐ సెక్రటరీగా పని చేశారు. అనంతరం పెద్దాపురం డివిజన్ అధ్యక్షునిగా, కార్యదర్శిగా 2005-2007 కాలంలో బాధ్యతలు నిర్వర్తించారు. 2007లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలపై చేపట్టిన సైకిల్ యాత్రలో కీలక పాత్ర పోషించారు. అనంతరం రాజమండ్రి డివిజన్ కార్యదర్శిగా 2008 నుంచి 2011 వరకూ బాధ్యతలను నిర్వర్తించారు. 2011 నుంచి 2016 వరకూ కాకినాడ జిల్లా అధ్యక్షునిగా, కార్యదర్శిగా సేవలందించారు. 2017-2021 వరకూ డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగానూ, పౌరసంక్షేమ సంఘం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2022లో పౌరసంక్షేమ సంఘం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అదే ఏడాది డిసెంబరులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.



రాజులోవ(ఫైల్ ఫొటో)

పర్యావరణ పరిరక్షణకు కృషి అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా అటవీ సంరక్షణ అధికారిణి ఎస్. భరణి సూచించారు. గురువారం జిల్లా అటవీ సంరక్షణ అధికారిణి కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు చెందిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 2న జిల్లా స్థాయి పర్యావరణ పోటీలను కాకినాడ శ్రీనగర్ ఎఫ్‌సి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎపి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(అటవీ శాఖ), విబివిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 2వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు పర్యావరణ-పరిరక్షణ అనే విషయం పైన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఇతర వివరాలకు 99127 03697, 62811 58344 ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, సబ్ డివిజనల్ ఫారెస్ట్ టి.అనూష, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున, వైల్డ్ లైఫ్ బాయలజిస్ట్ డి.మహేష్‌బాబు, జిల్లా సమన్వయకర్త కెవికె.మహేశ్వరరావు, క్లస్టర్ సమన్వయకర్తలు విఎస్‌వి.రమణమూర్తి, పిల్లి గోవిందరాజులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అటవీ శాఖ అధికారులు

భోజన పథక కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని నీలపల్లి ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం వివిధ ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథక కార్మికులకు శిక్షణ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు ఎ.మంగాయమ్మ, ఎం.ఉమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక ,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లుగా జి.గంగాభవాని, సిహెచ్.దుర్గాభవాని వ్యవహరించారు.అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రాధాకృష్ణ భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

రక్త గ్రూపులపై విద్యార్థులకు అవగాహన



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు రత్న

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో గురువారం రక్త గ్రూపులు, రక్త అవసరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నామాల అనూష, కమ్మర సురేంద్ర రక్తంలో ఉండే గ్రూపుల వివరాలు, ప్రస్తుత సమాజంలో రక్తం అవసరాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. మహారాణి కళాశాల అధ్యాపకులు విల్లా లక్ష్మి బాలలకు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయిని ఆర్.రత్న దేశభక్తి గీతాలు పాడటంలో శిక్షణ ఇచ్చి వారితో దేశభక్తి గీతాలు పాటించారు. కరాటే లో పూజితా సూర్యశ్రీ, కర్ర సాములో నీలపాల కృష్ణ, వినోద్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, కె.రవికుమార్, అమృత, సాయి, నేహా, రేణుక, పవన్‌కుమార్, మణికంఠ, వివేక్, గౌస్ పాల్గొన్నారు.

మట్టి మాఫియా దౌర్జన్యం

ప్రజాశక్తి - సామర్లకోట

తనపై మట్టిమాఫియాకు చెందిన వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడ్డారని విఆర్‌ఒ నూతలపాటి లోవరాజు అన్నారు. ఈ సంఘటనపై తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. స్థానిక జగ్గమ్మ గారి పేట సమీపంలో రెండు జెసిబిలు, 10 టిప్పర్ లారీలతో మట్టిని తవ్వుతుండగా తాను అడ్డుకోవడానికి వెళ్లినట్లు తెలిపారు అయితే టిప్పర్ లారీల డ్రైవర్లు నిర్లక్ష్యంగా తనపైకి లారీని ఎక్కిం చబోయారని, అప్రమత్తంగా వ్యవహరించి పక్కకు తప్పుకుని ప్రాణాలతో బయటపడ్డానని చెప్పారు



విఆర్‌ఒను ఢీకొట్టబోయిన మట్టి రవాణా లారీ

బాలలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో గురువారం విద్యార్థులకు నీతి కథలు చదవడం, నీతి కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు నీతి కథలను బాలలతో చదివించి, ఆ కథల సారాంశాన్ని వివరించారు. అనంతరం నీతి కథలు చెప్పడంలో నిర్వహించిన పోటీలో విజేతలైన ఎస్‌కె సుభాని, ఎస్‌కె నవాజ్, జి.మృదులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లయ్య, మనోహర్, కాటమరాజు, ఎల్.రాజు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రానున్న జూన్ 4వ తేదీ ఉదయం ఏడు గంటలకు కాట్రేనికోన మండలం చేయ్యేరు గ్రామంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూములు ఓపెన్ చేసి కౌంటింగ్ ప్రక్రియను ఎనిమిది గంటలకు ప్రారంభిస్తారన్నారు. తొలుతగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును ప్రారంభించి ఉదయం 8:30 గంటలకు అసెంబ్లీ నియోజక వర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్ కు ఇవిఎం లో నిక్షిప్తమై ఉన్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో నాలుగో తేదీ ఇంజనీరింగ్ కళాశాలకు రెండు వైపులా అనాతవరం వైపు, కాకినాడ వైపు ట్రాఫిక్ ను దారి మళ్లిస్తారన్నారు. ఈ ట్రాఫిక్ మళ్లింపు వివరాలను ప్రజలకు ముందుగా మీడియా ద్వారా ప్రకటిస్తారన్నారు. ఫెసిలిటేషన్ కేంద్రాలు, ఓం ఓటింగ్, అత్యవసర సేవలు, పోలింగ్ సిబ్బంది ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఒక టేబుల్ పైన, సర్వీస్ ఓట్లను మరొక టేబుల్ పైన లెక్కిస్తారన్నారు. జిల్లాలో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితం మొదటగా వెలువడే అవకాశం ఉందన్నారు ఎన్నికల మీడియా కేంద్రంలో హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం ద్వారా ఎప్పటికప్పుడు రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలను ఆన్లైన్లో పంపిస్తారన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రజలు గుంపులుగా రావాల్సిన అవసరం లేదని ఇంటిలో ఎన్నికల ఫలితాల ను టీవీ ద్వారా వీక్షించ వచ్చునని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ సందర్భంలో బాణసంచా మద్యం విక్రయాలపై మరియు లూజు పెట్రోల్ అమ్మకాలపై పూర్తిగా నిషేధం విధించామన్నారు. ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగాను మరియు కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల పరిధిలో 144 సిఆర్‌పిసి సెక్షన్‌ను అమలు చేస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియ మాదిరిగానే కౌంటింగ్ ప్రక్రియలో కూడా పూర్తిగా సంయమనం పాటించాలని ఆయన సూచించారు. కౌంటింగ్ పారదర్శకంగా, పకడ్బందీగా అప్రమత్తత కచ్చితత్వంతో సిబ్బంది పనిచే యాలని, కౌంటింగ్ కేంద్రంలో తప్పిదాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఫలితాలు సజావుగా వచ్చేలా వ్యవహరించాలని తెలిపారు. సిబ్బంది ఎక్కడా సొంత నిర్ణయాలు, ఆలోచనలు, ప్రయోగాలు చేయరాదని, ఎన్నికల నియమావళి తప్పక పాటించాలన్నారు. ఏజెంట్లతో సమన్వయంతో, సహనంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్ నియోజకవర్గ లెక్కింపు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, సిబ్బంది కూర్చునే విధానం, లెక్కింపు ఏజెంట్లు, ఆర్‌ఓలు, సూక్ష్మ పరిశీలకుల సీటింగ్ ఏర్పాట్లు, లెక్కింపు కేంద్రాలకు చేరుకునేందుకు ఏర్పాటు చేసిన మార్గ సూచికలు, బారికేడ్లను పరిశీలించారు. ఏజెంట్లు, సిబ్బంది వచ్చి వెళ్లేందుకు మార్గాలను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల నుంచి ఇవిఎంలను నేరుగా లెక్కింపు కేంద్రాలకు తీసుకువచ్చే మార్గాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేస్తూ ఆయన పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు జి.కేశవర్ధన్ రెడ్డి, ఎ.శ్రీరామచంద్రమూర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సప్లమెంటరీ జీవశాస్త్రం పరీక్షకు 1204 మంది హాజరు

ప్రజాశక్తి -ముమ్మిడివరం

పది సప్లమెంటరీ భౌతిక శాస్త్రం పరీక్షకు సంబంధించి జిల్లాలో 2109 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 1204 మంది పరీక్షలకు హాజరైనట్లు గురువారం డిఇఒ ఎం.కమల కుమారి తెలిపారు. జిల్లాలో వీరి కోసం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా 1204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, అయితే 905 మంది విద్యార్థులు గైర్హాజరరయ్యారని డిఇఒ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేయగా డిఇఒ ఎం.కమల కుమారి 3, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ 3 పరీక్ష కేంద్రాలలోనూ తనిఖీలు నిర్వహించారు. కాగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 81 మందికి కేవలం 18 మంది హాజరు కాగా 63 మంది గైర్హజరయ్యారని మండల విద్యాశాఖాధికారి బి.రమణశ్రీ తెలిపారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగాయి. ఈ సందర్భంగా చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. **రామచంద్రపురం :** పట్టణంలో గల గ్రంథాలయంలో గురువారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు .ఈ పోటీలకు ప్రముఖులు డి.శ్రీనివాసు, సూర్యనారాయణ, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పలు అంశాలకు సంబంధించిన చిత్రాలను విద్యార్థులు ఈ సందర్భంగా డ్రాయింగ్ వేశారు. గెలుపొందిన విద్యార్థులకు ముగింపు ఉత్సవాల్లో బహుమతి ప్రదానం చేస్తామని గ్రంథ పాలకులు లైబ్రేరియన్ డి.వెంకటరమణ, అసిస్టెంట్ లైబ్రరీయన్ వనజాక్షి ఈ సందర్భంగా తెలియజేశారు. **ఆత్రేయపురం:** విద్యార్థి విద్యార్థులు తెలుగు భాషతో పాటు మిగతా భాషల్లో కూడా పొట్టుతో సాధించాలని శాఖ గ్రంథాలయ అధికారి తమ్మ నమ:శివాయ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా ఆత్రేయపురం శాఖ గ్రంథాలయం విద్యార్థులకు నీతి కథలు, జనరల్ నాలెడ్జ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు ఇంగ్లిష్, తెలుగు భాషా పుస్తకాలు చదవడం అవగాహన కల్పించారు.

బాలబాలాజీ నిత్యాన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు గురువారం దాతలు విరాళం అందజేశారు. రామచంద్ర పురానికి చెందిన గౌతు లక్ష్మి లింగ తాయారు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గౌతు వేంకటేశ్వర రావు ప్రతి ఏటా ఫిబ్రవరి26న అన్నదానము జరిపించు నిమిత్తం రూ.10,117 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంది మాధవి తెలిపారు. విజయవాడ , గంపలగూడెంకు చెందిన కుప్పాల శ్రీకాంత్, రాజేశ్వరి దంపతుల పెళ్లి రోజున ప్రతి ఏటా నవంబర్8న అన్నదానము జరిపించు నిమిత్తం వారి కుటుంబ సభ్యులు బొమ్మకాని కోటేశ్వరరావు అరుణ కుమారి రూ.10,000 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు మరియు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంలు అందజేశారన్నారు.



దాతలకు చిత్ర పటం అందిసున్న ఆలయ సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జిల్లాలో పలుచోట్ల సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ట్రీ కటింగ్ తదితర పనులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గురువారం విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆత్రేయపురం: ఆత్రేయపురం, అంకంపాలెం, పేరవరం, సబ్ స్టేషన్ లో 33 కెవి లైను, మరమ్మతులు దృష్ట్యా మండలం పరిధిలో 17 గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. **ముమ్మిడివరం:** మండల విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతులు మరియు ట్రీ కట్టింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవి కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

యానాం వార్తలు



సిఐటియు ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

ప్రజాశక్తి - యానాం

పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగల్గుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని యానాంలోని పలు పరిశ్రమలు, యానాం సెంటర్ టాక్సీస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటూ, కార్మికవర్గ రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సిఐటియు ఏర్పడిందన్నారు. అసంఘటితరంగ కార్మికులైన ఆటో, హమాలి, భవన నిర్మాణ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేంత వరకూ అలుపెరగని పోరాటాలకు కార్మికవర్గం సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యానం కన్వీనర్ కుంచే సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్, యాదల శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, దాసరి రాజు, సలాది నాగబాబు, గూడి సత్తిబాబు, గుత్తాల రాజేష్, మన్నె బుజ్జి పాల్గొన్నారు.

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యానాంలో జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని పుదుచ్చేరి విద్యాశాఖ అధికారి పి.ప్రియదర్శిని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవంగా వేసవి సెలవుల అనంతరం జూన్ 2న పాఠశాలలు పున్ణప్రారంభం కావాల్సివుంది. అయితే ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండటంతో జూన్ 12 నుంచి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు పున్ణప్రారంభిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

వైసిపి పాలనకు అంతం బాబుతోనే సాధ్యం



వేగుళ్లను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్రంలో దుర్మార్గమైన పాలనకు అంతం చంద్రబాబుతోనే సాధ్యమని జూన్ 4న వచ్చే ఎన్నికల ఫలితాలు తేల్చనున్నాయని టిడిపి కాకినాడ రూరల్ ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అమలాపురం పార్టీ కార్యాలయంలో అమలాపురం పార్లమెంటు టిడిపి కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను, టిడిపి మండపేట నియోజకవర్గం అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును వారి స్వగృహంలో టిడిపి రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావుతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నులుకుర్తి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు పడుతున్న బాధలు, వైసిపి అరాచక పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకుంటూన్నారన్నారు. వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రజలు తమ మద్దతు ఇచ్చారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కచ్చితంగా కూటమిదే విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో బిక్కిన సత్తిబాబు, కొప్పిశెట్టి నాగబాబు, కొప్పిశెట్టి సాయి, దమ్ము నూకరాజు, మల్లంపల్లి నారాయణ పాల్గొన్నారు.